# మెడపాము

"ఏ వయసులో జరగాల్సిన అచ్చటాముచ్చటా ఆ వయసులో జరగాలన్నారురా అన్నయ్యా!" నా ఆరాటాన్ని ఆప్యాయంగా వెలిబుచ్చాను. అన్నయ్య పెదాల మీద సన్నని చిరునవ్వు మెరిసింది.

అందరు ఆడవాళ్ళలాగే నాక్కూడా పుట్టిల్లంటే పుట్టెడు ప్రేమ. రోజూ డ్యూటీ ముగించుకుని ఇంటికెల్తూ పుట్టింట్లో కాస్సేపు గడపడమనే హాబీ అలవాటైంది. మేము హైదరాబాదీలము. అన్నయ్య సాఫ్ట్‌వేర్ ఇంజనీరైతే నేను సర్కారాఫీసులో సాధారణ ఉద్యోగినిని.

"అమెరికాలోని నెలజీతం ఇక్కడే తీసుకుంటున్నావు. నువు అదృష్టవంతుడివన్నయ్యా!" అంటే వాడు ఆడపిల్లలా చేతులు తిప్పుతూ "నీ అదృష్టానికేం తక్కువటా! నువు తాన అంటే తందాన అనే భర్త దొరికిందు. అంత పెద్దాఫీసరైనా బావ నువ్వేదన్నా గంగెద్దులా తలూపుతాడు". పాత పాట అందుకుంటాడు. అన్నయ్య ఆఫీసు నుండి రాకముందే అమ్మ చేతుల్తో తయారైన సర్వపిండి లాగించి గరం చాయ్ సేవించాను. అలవాటు ప్రకారం అమ్మ "వాణ్ణి పెళ్ళికొప్పించి పుణ్యం కట్టుకోవే. లేకపోతే స్వర్గంలో ఉన్న మీ నాన్న ఆత్మ క్షోభిస్తుంది" అనేసింది. అన్నయ్య పెళ్ళైతే ఎంచక్కా వదినతో పరాచకాలాడొచ్చు.

నా కెదురుగా కూచున్న అన్నయ్య వేడి చా జుర్రుకుంటున్నాడు. ఖాళీ కప్పు టీపాయ్ కప్పగిస్తూ "మీ దోస్త్ యమున పెళ్ళి చేసుకుంటుందా?" పాత అస్త్రం ప్రయోగించాడు. యమున నా కోవర్కరు. నా వయసే. దొండపండు దేహ ఛాయలో ప్రబంధ నాయికలాగుంది. ఓసారి వాళ్ళింటికెళ్లాను. వాళ్ళమ్మ నాకు చా అందిస్తూ "యమున నీ గురించి చాలా చెప్తుందమ్మా. ఇంట్లో మేమిద్దరమే గదా! వాళ్ళ నాన్న బతికుంటే...." గొంతులో గమకం... "చాల్లేమ్మా! భవాని రాంగనే షురూ జేసినవా!" అంటూ వారించింది యమున.

ఓ రోజు అనూహ్యంగా యమున ఫోన్‌లోకి వచ్చింది. "భవానీజీ!" మా అమ్మ హార్ట్‌ఎటాక్‌తో చచ్చిపోయింది. మా వారెవ్వరూ లేరు" వెక్కుతోంది. కాస్సేపు నా నోట మాట రాలేదు. తర్వాత సర్దుకుని "నేనిప్పుడే మా అన్నయ్యతో వస్తున్నా" అన్నాను.

అన్నయ్యతో వెళ్ళాను. అన్నయ్య వాళ్ళ స్నేహితుల్ని ఫోన్‌లో చెప్పి రప్పించాడు. వృద్ధమాత అంత్యక్రియలు దగ్గరుండి జరిపించాడు. అప్పట్నుంచి మా స్నేహం ఆత్మీయతను రంగరించుకుంది.

ఆఫీసు లంచవర్లో క్యాంటీన్లో కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తుంటాము. అప్పుడప్పుడు అన్నయ్య గురించి అడిగి తెలుసుకుంటుంది. ఆమె అంతరంగాన్ని చదివెయ్యాలని "ఒంటరిగా ఇంకెన్నాళ్ళు? జంటగా మారిపోరాదా?" అనేశాను. "ఆ అదృష్టముండాలి గదా!" పేలవంగా నవ్వింది. "అప్సరసలాగున్నావు గదా!" అన్నాను. "అదృష్టం అప్సరసల సొంతమా?" అంటూ క్యారేజి గిన్నెలు సర్దేసింది.

"నేనింకా పరాయి దాన్నేనా?" చెయ్యందుకుని కళ్ళలోకి చూశాను.

"నో భవానీ" కళ్ళు మసకబారినై "నీ కంటే ఖాస్ దోస్త్ నా కెవరున్నారు?" నా చెయ్యందుకుని కళ్ళకద్దుకుంది. రెండశ్రుబిందువులు నా చేతి మీద పడినై. ఎవ్వరూ లేరు గదాని అటూ ఇటూ చూసింది.

"ఎవ్వరూ లేరు. చెప్పు యమునా" చేతిగుడ్డతో కళ్ళు అద్దాను.

"న్నా... నాకు తొడపాము.... తొడపాముంది. ఎవరు పెళ్ళాడ్తారు?" బేలగా చూసింది. నాలో కలకలం 'దాని గురించి వినడమే గాని ఎప్పుడూ చూడలేదు. అదుంటే భర్తకు ప్రాణగండమంటారు'... ఆ సంభాషణ ఇప్పుడు మెదడు పొరల్లో మెదిలింది.

"ఒరే అన్నయ్యా! నీ గుండె గూటిలో యమున చిలక అల్లరి పెడుతోంది గదూ" చెవి అందుకున్నాను. "పో భవీ!" విడిపించుకున్నాడు. బుగ్గల మీద సిగ్గులు దోబూచులాడినై ఇహ యమున మనసు తెలుసుకోవాలి. కాని తొడపామో! ఆ సంగతి అన్నయ్యకు చెప్పి విచారం వెలిబుచ్చాను. అమ్మ ఉలిక్కిపడింది. "అదో మూఢ విశ్వాసం!" అన్నయ్య కొట్టిపారేశాడు. "అబ్బా! ఆ అమ్మాయొద్దురా!" అమ్మ గుండెల మీద చెయ్యేసుకుంది. "నిజంగా అదో మూఢ విశ్వాసమమ్మా! ఆ అమ్మాయికి చదువుంది, సంస్కారముంది" పట్టుబట్టాడు అన్నయ్య.

"తొడపాము పుట్టినప్పటి నుండి వుందా?" అమ్మ బుర్ర గోక్కుంది.

నాకు తెలీదన్నాను. అన్నయ్య మొహం గంభీరమైంది. "పెళ్ళంటూ చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటా. ఆమెను ఒప్పించే బాధ్యత నీదే!" అంటూ నా నెత్తిమీదో మొట్టికాయిచ్చాడు.

"ఆదివారం మనిద్దరం వాళ్లింటికెల్తున్నాం రా అన్నయ్యా!"

అన్నయ్య హీరోహోండా యమున ఇంటి ముందాగింది.

"వావ్ భవానీ!" యమునా ప్రవాహంలా పరుగెత్తుకొచ్చిన యమున నా చెయ్యందుకుని ఇంట్లోకి నడిపించింది. తల స్నానం చేసిందేమో నల్లని కురుల్లోంచి తెల్లని నీటిబిందువులు ముత్యాల్లా రాలి పడుతున్నాయి. "ఫోన్ గూడా చెయ్యకుండా....!" ఓరగా చూసింది అన్నయ్యను. "చేసొస్తే బాజాబజంత్రీలతో స్వాగతించే దానివా!" బుగ్గగిల్లాను. జలపాతంలా నవ్వి జలనిధిలా గంభీరమైంది. జుట్టు ముడేసుకుంటూ కూచొమ్మని కుర్చీలు చూపించింది. నా పక్కన తానూ కూచుంది.

"చెప్పా పెట్టకుండా వచ్చాము" ఇబ్బందిగా అన్నాడు అన్నయ్య.

"బహుత్ ఖుషీ యాద్గిరీ సాబ్! మీరు నాకాత్మీయులు" యమున మొహమ్మీద శుభ్రజ్యోత్స్న ఛాయలున్నై. పనికిరాని కబుర్లతో టైం వృధా అయిపోతోంది. అసలు సంగతికి రావాలని అన్నయ్యకు సైగ చేశాను. "యమునా నీకో పెళ్ళి సంబంధం తెచ్చాను" అంటూ సూటిగా చూశాను.

"న్నా... నాకా!" బిత్తరబోయింది. నిర్వేదంగా నవ్వింది. "జోకులెందుగ్గానీ... గరం చాయ తాగుదాం!" లేవబోయింది.

ఆపేసి "మా అన్నయ్య గురించి నీ అభిప్రాయమేమిటి?" గంభీరంగా అడిగాను.

"ఎందుకటా" కనుబొమలు టపటపలాడినై.

"మా అన్నయ్య గుండె గూటిలో నువ్వో చిలకవైనావటా!"

"నాకా అదృష్టం లేదు. నీకంతా చెప్పాను కదా!"

"అది మూఢనమ్మకమంటున్నాడు అన్నయ్య".

"నిజంగానా!" చటుక్కున తల పైకెత్తింది.

"అవును కానీ..... నీకా తొడపాము పుట్టుకతో వచ్చిందా?"

"లేదు చెప్పనా ఎట్లా వచ్చిందో!"

"సరే.... చెప్పండి" అన్నయ్య ఆతృత.

"నేను పుట్టింది కాశ్మీర్‌లో..." ప్రారంభించింది.

"అందుకే ఆపిల్‌పండులాగున్నావు" నా సపోర్టు. యమున మొహం మబ్బు మాటున చందమామ లాగైంది.

"కాశ్మీర్‌ను భారతమాత నుదుటి సిందూరమంటారు గదా! గల గల పారే సెలయేర్లు, అందాల సరస్సులు, ఆపిల్ తోటలు... ఆ భూలోక స్వర్గంలో మేము మమేకమై పోయినం. బర్ఫ్ కొండల మీద సరదాగా ఆడుకునే వాళ్ళం. ఆకుపచ్చని కాశ్మీర్లో జిహాదీ టెర్రరిస్టులు అగ్ని మంటలు రేపిండ్రు. అక్కడ హిందువులు మైనార్టీలు. మా నాన్నది హోల్‌సేల్

పండ్ల వ్యాపారం. ఆపిల్ పళ్ళను అట్టడబ్బాల్లో ప్యాక్ చేసి అన్ని నగరాలకు పంపేవారు. హైద్రాబాదు డీలర్ల ద్వారానే హైద్రాబాదమ్మాయి... అంటే మా అమ్మతో నాన్నకు పెళ్ళయిందటా. అక్కడి మైనార్టీలు పాకిస్తానీ జిహాదీలకు శత్రువులు. అక్కడి యువకుల్ని దొంగచాటుగా తీసుకెళ్ళి సాయుధ శిక్షణ నిస్తున్నారనీ ఇతర మతాల పట్ల ద్వేషం నూరిపోస్తున్నారని తెలిసింది. మైనార్టీ జనాలను మట్టుబెట్టడమే వారి లక్ష్యం. మా గల్లీలోని రెండు హిందూ కుటుంబాల మీద పట్టపగలే దాడి జరిగింది. మగవాళ్ళను నిర్దాక్షిణ్యంగా నరికేసింంద్రు. యువతుల్ని ఘోరంగా చెరచి చంపేసింంద్రు. చిన్న పిల్లల ఒంటిమీద కత్తులతో జిహాద్ అని నినాదాలు రాసింంద్రు. కాశ్మీర్ కల్లోలంలో ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని వేలాది మైనార్టీలు పారిపోయింంద్రు. అప్పుడు మా అక్కకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. ఆ రోజు ...

"మనం వెంటనే హైద్రాబాదు వెళ్ళిపోదాం" అన్నది అమ్మ.

"సరే.... హైద్రాబాదులున్న మా డీలర్లకు ఫోన్‌చేస్తా"నని నాన్న టెలిఫోన్ దగ్గరికెళ్తున్నాడు. మా ఇంటి ముందు భయంకరంగా బాంబులు పేలినై. ఫోను వైరు కట్టయింది. జిహాద్ నరరూప రాక్షసులు తుపాకులు, కత్తులతో ఇంట్లో చొరబడ్డారు. లబలబలాడుతూ, అరుస్తూ మేము ఇల్లంతా పరుగులు తీసినం. అమ్మ కనబడలేదు. నేను నాన్న, అక్క హాహాకారాలు చేస్తున్నాం. నాన్న "నువ్వు పారిపో" అని అక్కను హెచ్చరించాడు. అక్క పెరట్లో కురికింది.

ఇద్దరు జిహాదీలు వెంబడించి అక్కను లాక్కొచ్చారు. పులినోట్లో మేకపిల్లలా అక్క అరిచి గీపెట్టింది. మొత్తుకుంటుంది. ఒకడు నాన్న గుండెల మీద తుపాకి పెట్టి తాళాలు లాక్కున్నాడు. నాన్నను గడపదాకా ఈడ్చుకెళ్ళి కాళ్ళూ చేతులు నరికేశాడు. ఆర్తనాదాలు ఆకాశాన్నంటినా ఎవ్వరూ సాయం రాలేదు. వాళ్ళు పిచ్చికుక్కల్లా అక్కమీద ఎగబడి గుడ్డలు చించేసింంద్రు. అక్క ఆర్తనాదాలు అరణ్య రోదనమై పోయినై. ఒకరి తర్వాత ఒకరు అక్కను రాక్షసంగా మానభంగం చేసింంద్రు. ఆ తర్వాత స్తనాలు, తొడలు కొసేసింంద్రు. నేను గొంతు చించి ఏడుస్తూ రక్తంలో మాంసం ముద్దల్ని చూస్తూ కూలబడిపోయిన. నా ఏడ్పునెవ్వరూ పట్టించుకోలేదు. ఇద్దరు రాక్షసులు పట్టుకున్నరు. "ఇది చిన్నపిల్ల గదా! నిషాన్ వేద్దా" మనుకున్నరు.

"ఛోడ్ దో అంకుల్" అని నేను ఎంత మొత్తుకున్నా రాతిగుండెల్లో తేమ పుట్టలేదు. నన్ను వెల్లకిలా పడుకోబెట్టి పైజామా లాగి పారేసింంద్రు. చురకత్తులతో తొడల మీద ఏదో అక్షరాలు రాసి పోయింంద్రు. నేను స్పృహ కోల్పోయాను. మెలకువలో కొచ్చేసరికి తొడల మీద కారప్పొడి చల్లింంద్రని నేల మీద పడున్న పొడి చూశాక అర్థమైంది. అదో నరకయాతన.

ఏడుస్తూ లేచాను. నీళ్ళతో కడుక్కుని నూనె రాసుకున్నాను. అప్పుడే ఇంటి చుట్టూ మంటలు లేచినై పెరటి గుమ్మం ద్వారా బయటికొచ్చాను. ఆపసోపాలు పడుతూ బస్టాండు చేరుకున్నాను. అమ్మ అక్కడ కనిపించింది. తాను ముందే తప్పించుకున్నానంది. జరిగిందంతా చెప్పేశాను. దిక్కులేని పక్షులమైపోయినం. అమ్మ హ్యాండుబ్యాగులో ఉన్న డబ్బుల్తో ఢిల్లీ చేరుకున్నం. అమ్మ మంగళసూత్రం ఢిల్లీలో అమ్మేసి హైద్రాబాదు కొచ్చినం. అమ్మ పుట్టింట్లో ఎవ్వరూ లేరు. రోజంతా గల్లీలు తిరుగుతూ మా దీనగాథ చెప్పుకున్నం.

మా నాన్న పేరు చెప్పగానే ఓ పండ్ల వ్యాపారి గుర్తుబట్టిండు. మమ్మల్ని ఆదరించి వాళ్ళింట్లో ఉండుమన్నడు. అమ్మకు నాలుగైదు ఇళ్ళల్లో పాచిపని దొరికింది. నన్ను తెలుగు బడికి పంపించింది. వ్యాపారి భార్య గూడా మమ్మల్ని ఆత్మీయంగా చూసుకునేది. ఓసారి ఆమె నా తొడల మీద గీతలు చూసింది. అమ్మను పిలిచి "యమునకు తొడపాముంది గదా! ఈ పిల్ల నెవరు పెండ్లాడ్తరూ?" అంటూ బుగ్గలు నొక్కుకుంది. బాధ కలిగి అమ్మ కళ్ళ గుండా చుక్కల్లా కన్నీరు రాలింది. ఆమెనే అమ్మ నూరడించింది. మా బాధామయ గాధ విని ఆమె గూడా కంట తడిపెట్టింది. కాని... తొడపాము సంగతి ఆడవాళ్ళ చెవుల్లో వేసింది. అది తొడపాముగానే ప్రచారమైంది" ....ఇహ చెప్పలేక పోయింది యమున. అప్పటికే నా మనసు కొంగలు తొక్కిన మడుగులాగైంది. నాలాగే అన్నయ్య గూడా ఉద్విగ్నానికి లోనయ్యాడు. గబుక్కున లేచి యమునను ఒడిలోకి లాక్కున్నాను. కొనకొంగుతో కళ్ళు తుడిచాను. "ఐతే మీరు విధిచేతిలో కీలుబొమ్మ లైనారన్న మాట!" అన్నయ్య నిట్టూర్చాడు.

"అవును యాద్గిరి సాబ్! అందరు ఆడపిల్లల్లా పెళ్ళి చేసుకోవాలని నాకూ ఉంది" అంది.

అన్నయ్య ఆమె కళ్ళలోకి చూస్తూ "ఇప్పుడు మీరంటే నాకెంతో గౌరవభావమేర్పడింది. మీ కభ్యంతరం లేకపోతే ...." అన్నాడు.

"మీ అభిప్రాయమే, నా అభిప్రాయం" సిగ్గుల భారంతో ఎరుపెక్కిన చెంపల్ని అరచేతుల్లో దాచుకుంది.

"తొడపాము కాదది. మన భారత మాత మెడపాము" అన్నయ్య వచ్చి యమున పక్కన కూచున్నాడు.

*(చేతన - జనవరి 2011)*